# మొదటి ప్రపంచయుద్ధ శతాబ్ది సంస్మరణ ఉత్సవాలు

# సామ్రాజ్యవాదుల కపటత్వం-దేశ పాలకుల దాసోహం

**1914-18** కాలంలో జరిగిన మొదటి ప్రపంచయుద్ధం ప్రపంచ దేశాలను దోచుకు నేందుకు సామ్రాజ్యవాదుల నడుమ జరిగిన యుద్ధంగా చరిత్ర నమోదు చేసింది. బ్రిటిష్, ఫ్రాన్స్ దేశాల నాయకత్వంలోని సామ్రాజ్య వాదుల కూటమికి, జర్మనీ సామ్రాజ్యవాదుల నాయకత్వంలోని సామ్రాజ్యవాదుల కూటమికి మధ్య ఈ యుద్ధం సాగింది. "యుద్ధ పిపాసతో నున్న ఈ సామ్రాజ్యవాద శిబిరాలు రెండూ, దేశాలను లూటీ చేయడంలో, అంతులేని యుద్ధ క్రూరత్వాన్ని చూపడంలో, అత్యాచారాలు సాగించడంలో ఒకదానికొకటి తీసిపోవు" అని 1915లోనే లెనిన్ పేర్కొన్నారు. "భూభాగాలను స్వాధీనం చేసుకోవడం, ఇతర దేశాలను లోబరచుకోవటం, పోటీలో వున్న దేశాలను నాశనం చేయటం, సంపదను లూటీచేయటం, రష్యా, జర్మనీ, బ్రిటన్ మరియు ఇతర దేశాల లోని కార్మిక ప్రజానీకపు దృష్టిని ప్రక్కకు మళ్ళించటం, ఆయా దేశాలలో కార్మికుల ఐక్యతను బలహీనపరిచి, వారి శక్తిసామర్ధ్యాలను నిరర్ధకం చేయటం తద్వారా కార్మికవర్గ నాయకత్వ పాత్రను నిర్మూలించి, విప్లవ కార్మికోద్యమాన్ని బలహీనపరచటం అనేవే మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాధాన్యత, ప్రాముఖ్యత వహించిన కీలకాంశాలు" అని కూడా లెనిన్ పేర్కొన్నారు.

తమతమ దేశాల కార్మికవర్గాన్ని, ఇతర శ్రామిక ప్రజానీకాన్ని ఆయా దేశాల బూర్జువా వర్గం మోసగించింది. స్వేచ్ఛ, నాగరికత, పితృభూమి సంరక్షణల కోసమంటూ దేశభక్తి, జాతీయతవంటి ఆకర్షణీయమైన నినాదాలతో సామ్రాజ్యవాద దేశాల బూర్జువావర్గాలు తమ దుర్మార్గమైన, దోపిడీకోసం ఉద్దేశించిన ఈ యుద్ధానికి రంగులద్దారు. యుద్ధపిపాసతో నున్న రెండు సామ్రాజ్యవాద కూటములు వారికి కావలసిన మానవ, పాదార్థిక వనరులకోసం అప్పటికే తమ వలసలుగా వున్న దేశాల ప్రజానీకాన్ని బలిపశువులుగా ఉపయోగించాయి.

1918 నవంబర్ 11న జర్మనీ ఓటమి, లొంగుబాటుతో మొదటి ప్రపంచయుద్ధం ముగిసింది.

మానవ చరిత్రలో ఆనాటికి అదే అత్యంత రక్తపాతంతో కూడిన యుద్ధం. 6 కోట్ల 50 లక్షలమంది సైన్యం ఈ యుద్ధంలో పాల్గొన్నారు. 11,15,471 మంది సైనికులు చనిపోవటమో లేదా గుర్తించవీలులేకుండా అదృశ్యమైపోవటమో జరిగింది. 1 కోటీ 30 లక్షలమంది పౌరులు ఈ యుద్ధంలో మృతిచెందారు. 2 కోట్ల 10 లక్షలమంది సైనికులు గాయాలపాలయ్యారు.

బ్రిటిష్ వలసపాలకులు లక్షలాదిమంది భారత ప్రజానీకాన్ని తమ సైనిక బలగాలలోకి సమీకరించారు. భారత ప్రజలను వారు కిరాయి సైనికులుగా వుపయోగించి భారత ప్రజలను అణచివేయటానికి ఉపయోగించటంతోపాటు ఇతర దేశాలను బ్రిటిష్ వలసలుగా మార్చుకో వటానికి కూడా ప్రయోగించారు. మొదటి ప్రపంచయుద్ధ కాలంలో బ్రిటిష్ వలసవాదులు మనదేశ ప్రజానీకం నుండి 1 లక్షా 10 వేల మందిని సిపాయిలుగా సమీకరించి, వివిధ దేశాలపై తమ తరపున యుద్ధం చేయటానికి పంపారు. వీరిలో 75,000 మంది సైనికులు తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ విధంగా బ్రిటిష్ వలసవాదులు ఇతర దేశాలలో తమ వలసల ఏర్పాటుకు, వలసల విస్తరణకు భారత ప్రజానీకాన్ని బలిపెట్టారు. అణచివేత యుద్ధం ద్వారా తమ వలసవాద కాంక్షలను నెరువేర్చు కునేందుకు బ్రిటిష్ వలసవాదులు భారత ప్రజలను సమిధలను చేశారు.

'విజయం పొందిన దేశాలు'-ప్రధానంగా బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా మరియు ఇటలీ దేశాల సామ్రాజ్యవాద పాలకులు యుద్ధంలో విజయ ఫలాలను స్వంతం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. 1919 ప్రారంభంలో వారంతా శాంతి సమావేశంగా చెప్పబడేదానిని నిర్వహించి, వర్సెయిల్స్ సంధిగా పిలవబడే దానిని రూపొందించారు. పరాజయం పాలైన జర్మనీ లొంగిపోయేందుకు విధి విధానాలను అందులో ఖరారు చేశారు. విశాల జర్మనీ భూభాగాలను, భారీ సైనిక బలగాలను, వ్యాపార నౌకలను, సంపన్న బొగ్గగనులపై అజమాయిషీని జర్మనీ వదులుకోవటంతోపాటు యుద్ధపరిహారం లేదా నష్టాల చెల్లింపు క్రింద భారీ మొత్తంలో సంపదను విజయంపొందిన దేశాలకు చెల్లించాలని, జర్మనీ సైనికశక్తిని కలిగివుండరాదని, సైనిక బలగాలను రద్దుచేయాలని ఈ వర్సెయిల్స్ ఒప్పందంలో పేర్కొన్నారు. విజేతలకు యుద్ధ పరిహారం చెల్లింపుకు గ్యారంటీగా జర్మనీ తన దేశంలోని రైన్ నది ఎడమ తీరాన్ని 15 సం॥ల కాలం విజేతలైన దేశాల ఆధీనంలో వుంచాలి.

వాస్తవానికి ఈ ఒప్పందం చాలా అవమానకరమైనదీ, వినాశకరమైనది. జర్మనీ దేహంపై, మనసుపై ఈ ఒప్పందం లోతైన గాయాలను చేసింది. అయితే కేవలం ఓ దశాబ్ద కాలంలోనే, ఈ గాయాలనే సారవంతమైన భూమికగా ఉపయోగించుకొని హిట్లర్ తీవ్రమైన ఆగ్రహంగా, ప్రతీకారంగా మలిచాడు. మొదటి ప్రపంచయుద్ధానికంటే దూకుడైన, మరింత క్రూరమైన ప్రపంచయుద్ధం ద్వారా ప్రపంచాధి పత్యమనే తమ చెదిరిన స్వప్నాన్ని సాకారం చేసుకోవాలనే కాంక్షను జర్మనీ పాలకవర్గాల నడుమ రేకెత్తించాడు.

మొదటి ప్రపంచయుద్ధం జర్మనీ ప్రజలను ఘోరమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి, చెప్పనలవి కాని బాధలకు గురిచేసింది. విజేతలైన దేశాల ప్రజలకు కూడా ఈ యుద్ధం ఒరగబెట్టిందేమీ లేదు; ఎందుకంటే ఈ యుద్ధానికి ప్రజల ప్రయోజనాలతో సంబంధమే లేదు కనుక. సామ్రాజ్యవాద దేశాలు ఈ యుద్ధాన్ని, విజయాలను ఉపయోగించుకొని తమ దేశాల పైన,

అదేవిధంగా తమ వలసదేశాలపైనా తమ పట్టును సంఘటితం చేసుకొని, గట్టిపరుచుకొని, మరింత విస్తరించటానికి ఉపయోగించుకున్నాయి. ఈ యుద్ధ భారాలను ప్రజలపైకి మళ్ళించటం ద్వారా సామ్రాజ్యవాద దేశాలు మరింతగా తమ లూటీని కొనసాగించాయి.

రష్యాలో మినహా దాదాపు అన్ని ఐరోపా దేశాలలోనూ సోషల్ డెమోక్రటిక్ పార్టీల నాయకత్వాలు - బూర్జువా జాతీయ ఛాంధస నినాదమైన 'పితృదేశ రక్షణ'కు లొంగిపోయి, వారి వారి దేశాల పాలకపార్టీల తోక పుచ్చుకు వెళ్ళే వైఖరి చేపట్టాయి. కనుక, ఆ పార్టీలు తమ తమ దేశాలలో బూర్జువావర్గాన్ని అధికారం నుండి కూలదోసే విప్లవోద్యమాలను పురోగ మింపజేయటానికి, ఈ సామ్రాజ్యవాద సంక్షోభాన్ని, యుద్ధాన్ని ఉపయోగించుకోలేక పోయాయి. రష్యాలో శ్రామికవర్గం లెనిన్ నాయకత్వంలో, మార్గదర్శకత్వంలో సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసుకునేందుకు సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మలచుకుంది. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా సామ్రాజ్యవాదులతో ముడివేసుకున్న జారిస్టు నిరంకుశత్వాన్ని వారు కూలదోశారు.

మొదటి ప్రపంచయుద్ధ కాలంలో భారతదేశం బ్రిటిష్ వలసదేశంగా వుంది. దేశప్రజానీకం ఫ్యూడలిజానికి, వలసపాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్నారు. కార్మికవర్గ ఉద్యమం ఆనాటికి ప్రారంభదశలో వుండగా, కార్మికవర్గ పార్టీ ఇంకా ఉనికిలోకి రాలేదు. వలస పాలకుల ఆశీస్సులతో ముందుకు వచ్చిన బూర్జువా రాజకీయ నాయకత్వానికి, మన దేశంలో వలసపాలనను అంతంచేసే ఎజెండానే లేదు. గాంధీతోసహా నాయకత్వమంతా యుద్ధంలో వలస పాలకులకు మద్దతు నందించారు. యుద్ధానికి కావలసిన పాదార్థిక, మానవ వనరులను సమకూర్చుకోవటానికి బ్రిటిష్ ప్రభుత్వానికి ఈ పరిస్థితి బాగా తోడ్పడింది.

కాగా, మన ప్రజలకు మాత్రం ఇదొక పీడకలగా మిగిలిపోయింది. ఈ సామ్రాజ్యవాద యుద్ధంలో మనదేశ అత్యుత్తమ పౌరులు తమ ప్రాణాలు అర్పించారు. ఈ యుద్ధంలో భారత సిపాయిలు గొప్ప తెగువను ప్రదర్శించి ప్రాణాలను లెక్కచేయక పోరాడారన్నది నిజం. అయితే ఈ యుద్ధంలో వారు కిరాయి సేనలు మినహా మరోటి కాదు. అణచివేతదారుల సేవలో వారు తమ ప్రాణాలొదిలారు. మొదటి ప్రపంచ యుద్ధపు అత్యంత విషాదకర భాగము, ప్రధానాంశము మరియు చేదు వాస్తవమూ ఇదే.

అయితే 100 సం॥ల తర్వాత, 'భారత దేశం మరియు మహాయుద్ధ శతాబ్ది' పేరిట మొదటి ప్రపంచయుద్ధాన్ని సంస్మరించుకునే భారీ పథకాన్ని ముందుకు తేవటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తలమునకలై వున్నారు.

దీనికోసం వారు అనేక కార్యక్రమాలను రూపొందించారు. (1) మొదటి ప్రపంచయుద్ధంలో పాల్గొన్న భారత సిపాయిల యూనిఫారాలు, పతకాలు, వస్తువులు మొదలైన వాటిని మన దేశం నుండి, ఇతర దేశాలనుండి సేకరిస్తున్నారు. (1799 నాటి టిప్పుసుల్తాన్ ఖాన్జి(కత్తి), స్కిన్నర్ హార్స్ సైనిక పటాలానికి చెందిన 1840 చిత్రాలు కూడా వీనిలో వున్నాయి). 18వ శతాబ్దపు ప్రారంభకాలంనుండి 1947 మధ్య కాలంలోని ఈ వస్తువులను సేకరిస్తున్నారు. రెండు సంవత్సరాల కాలంపాటు ఈ వస్తువులన్నింటినీ ప్రదర్శనకు వుంచుతారు.

(2) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నాలుగు సంవత్సరాల యుద్ధ కాలంలో భారతదేశాన్ని ప్రధానంగా అన్వేషించే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. బెల్జియం, ఫ్రాన్స్, గల్లిపోలి సెర్బియా, రష్యా మరియు చైనాలలో భారత సైనికులు యుద్ధరంగంలో చేసిన అనేక సేవలను ప్రధానంగా పేర్కొంటూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

(3) మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో భారతదేశానికి సంబంధించిన సాహిత్యాన్ని ప్రచురిస్తారు. వీనిలో చిన్న పుస్తకాలు, చిత్రాలతో కూడిన పుస్తకాలు, యుద్ధరంగానికి చెందిన మార్గదర్శకాలు మొదలైనవి వుంటాయి.

(4) ఈ సేకరణలన్నింటినీ శాన్‌హర్స్ట్‌లోని మ్యూజియమ్‌లోను, లండన్‌లోని నేషనల్ ఆర్మీ మ్యూజియమ్ గ్యాలరీలోనూ వుంచుతారు.

శతాబ్ది సంస్మరణ ఉత్సవాలలో భాగంగా ఈ కాలమంతటా ఇంకా అనేక కార్యక్రమాలు కూడా రూపొందించారు.

"బ్రిటిష్ సైన్యం మరియు బ్రిటిష్ ఇండియా సైన్యం కలిసికట్టుగా పోరాడి చరిత్రను పంచుకున్న సందర్భమే మొదటి ప్రపంచ యుద్ధం" అని నేషనల్ ఆర్మీ మ్యూజియమ్ డైరెక్టర్ బ్రిగేడియర్ మెక్కీజెవిస్కీ పేర్కొన్నాడు. "భారత సిపాయిలు బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ నాయకత్వంలో ప్రపంచవ్యాపితంగా అనేక కీలక యుద్ధాలలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించారు" అని ఆయన చెప్పాడు.

మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణాలు వదిలిన 72,000 మంది సైనికుల పేర్లు వ్రాయబడివున్న న్యూఢిల్లీలోని ఇండియాగేట్ వద్ద వారిని ప్రతిఏటా సంస్మరించుకోవటం జరుగు తున్నదనేది గమనించాల్సిన అంశం.

భారత విదేశాంగ మంత్రిత్వశాఖ 'సెంటర్ ఫర్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ హిస్టారికల్ రీసెర్చ్' సంస్థతో కలిసి ఈ మొదటి ప్రపంచయుద్ధ శతాబ్ది సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తోంది.

2018 నవంబర్ 11న ఈ శతాబ్ది ఉత్సవాలు ముగుస్తాయి. 'మహత్తర యుద్ధం'లో సైనికుల 'త్యాగాలను' గుర్తుచేసుకునేందుకు 'యుద్ధ విరమణ దినాన్ని' పాటిస్తున్నారు. ప్రపంచ స్థాయిలో, 2018 నవంబర్ 10న సైనికుల పటా లన్నింటిలో కొవ్వొత్తులు వెలిగించి, మరణించిన వారి స్మృతిలో నివాళులర్పిస్తారు. 1914-18 కాలంలో భారీ యుద్ధం చేసిన 270కి పైగా ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరిస్తారు.

ఇక్కడ 'భారతదేశం, మహత్తర యుద్ధం' పేరిట శతాబ్ది సంస్మరణ ఉత్సవాల ముసుగులో సామ్రాజ్యవాదులు వారు సాగించిన యుద్ధాన్ని ఆకాశానికెత్తవలసిందిగా కోరుతున్నారు. ఈ యుద్ధంలో ప్రాణాలొదిలిన భారతీయుల 'త్యాగాల' గురించి వారు మాట్లాడటం ఎలా వుందంటే, బలిపీఠం మీదకు అలంకరించిన గొర్రెను ఊరేగింపుగా తీసుకువెళ్ళే నిర్వాహకుల మొసలికన్నీరు

లాగా వుంది. ఈ యుద్ధానికి భారత ప్రజల ప్రయోజనాలతో ఎలాంటి సంబంధంలేదు. కొన్ని దేశాల పీడిత ప్రజలను అణచటానికి, మరికొన్ని దేశాల పీడిత ప్రజలను ఉపయోగించటమే ఈ యుద్ధంలో జరిగింది. అణచివేతదారులు, వినాశకులు, బడాదోపిడీ దొంగలైన రెండు కూటములు పీడిత ప్రజల నుపయోగించి ప్రపంచంపై సామ్రాజ్యవాద దేశాల పెత్తనం లేదా ఆధిపత్యం సమస్యను పరిష్కరించుకోదలిచారు. మొదటి ప్రపంచ యుద్ధ శతాబ్ది సంస్మరణ ఉత్సవాలు నిర్వహించాలనే సామ్రాజ్యవాదుల పథకంతో భారత పాలకులు అంటకాగటం, అత్యంత నీచమైన, సిగ్గుమాలిన విషయం. సామ్రాజ్య వాదులకు ముందు సాగిలపడటం మినహా ఇది మరోటి కాదు. ఈ సిగ్గుమాలిన చర్యను స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను ఆకాంక్షించే సమస్త ప్రజానీకమూ, ముక్తకంఠంతో ఖండించాలి.

కేవలం తమ జీవనాధారంకోసం బ్రిటిష్ సైన్యంలో చేరిన భారతీయుల ఎడల, వారిలో 72 వేలమందికి పైగా నిస్సహాయంగా సామ్రాజ్యవాద దేశాల సేవలో మొదటి ప్రపంచయుద్ధంలో ప్రాణాలు కోల్పోవటంపట్ల, మనకు ఎల్లప్పుడూ సానుభూతి వుంటుంది. యుద్ధంలో మృతిచెందిన సైనికుల, వారి కుటుంబాలపట్ల మన సానుభూతిని, బాధను గాఢంగా, బిగ్గరగా ఇలా ప్రకటిద్దాం: సామ్రాజ్య వాదులకోసం దోపిడీ పాలకవర్గాలకోసం మరణించటానికి మేము సిద్ధంగా లేము; భారత పీడిత ప్రజానీకం, ఇతర పీడిత ప్రజానీకాన్ని లొంగదీసుకునేందుకు సాధనాలుగా సేవ చేసేందుకు వారు ఏనాడూ ఉపయోగపడబోరు. భూస్వామ్యానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దోపిడీ–అణచివేత–అసమానత–యుద్ధాలను శాశ్వతంగా రద్దుచేసేందుకు పోరాడి ప్రాణా లర్పించిన వారి నుండి మన ప్రజానీకం స్ఫూర్తిని పొందగలుగుతారు. ఆ అమరుల బాటలో ఆ పోరాటాన్ని ముందుకు కొనసాగించి భూస్వామ్య, సామ్రాజ్యవాద కోరలనుండి మన దేశాన్ని విముక్తి చేసే నూతన ప్రజాస్వామ్యం, సోషలిజం దిశగా ముందడుగు వేస్తారు.

oooo